ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 3 మే 2025

సేంద్రియ వ్యవసాయంలో ప్రగతి
ముగ్గురికి 'నమ్మాళ్వార్' అవార్డులు

● ప్రదానం చేసిన సీఎం స్టాలిన్



ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వంతో 'నమ్మాళ్వార్' అవార్డు అందుకున్న రైతులు

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంలో ప్రగతి సాధించి, ఆ వ్యవసాయ పద్ధతులను వ్యాపింపజేసి, ప్రోత్సహిస్తున్న ముగ్గురు రైతులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 'నమ్మాళ్వార్' అవార్డులతో సత్కరించారు. సచివాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ యేడాదికిగాను 'నమ్మాళ్వార్' అవార్డులకు ఎంపికైన కోయంబత్తూరు జిల్లాకు చెందిన కె.సంపత్‌కుమార్‌కు ప్రథమ బహుమతిగా రూ.2.50లక్షలు, రూ.10వేల విలువైన పతకంతో సత్కరించారు. ఇదే విధంగా తిరుప్పూరు జిల్లాకు చెందిన డి.జగదీష్‌కు ద్వితీయ బహుమతిగా రూ.1.50లక్షలు, రూ.7వేల విలువైన పతకం, నాగపట్టినం జిల్లాకు చెందిన వి.కాళిదాసుకు తృతీయ బహుమతిగా రూ.లక్ష నగదు, రూ.5 వేల విలువైన పతకాన్ని స్టాలిన్ ప్రదానం చేశారు.

151 మందికి నియామకాలు...

ఇదే విధంగా వ్యవసాయ శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు ఇటీవల నిర్వహించిన పరీక్షల ద్వారా ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 76 మంది జూనియర్ అసిస్టెంట్లు, 68 టైపిస్టులు, ఏడుగురు స్టెనోగ్రాఫర్లు ఈ నియామక ఉత్తర్వులను అందుకున్నారు.. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్.మురుగానందం, వ్యవసాయశాఖ ఉత్పాదక సంచాలకులు వి.దక్షిణామూర్తి, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సంస్థ కమిషనర్ డి.అబ్రహం, ఉద్యాన వన శాఖ డైరెక్టర్ పి.కుమారవేల్ పాండ్యన్, వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం చీఫ్ ఇంజనీర్ ఇరా మురుగేశన్ తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న సీఎం

రాజకీయాల్లోకి
రావాలనే ఆశ లేదు

● విజయ్ నిర్ణయం సాహసోపేతం ● నటుడు అజిత్



చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయాల్లోకి రావచ్చని, ఈ విషయంలో నటీనటులకు ఎలాంటి ఆంక్షలు లేవని సినీ నటుడు అజిత్ వ్యాఖ్యానించారు. రాజకీయాల్లోకి రావాలనే ఆశ తనకు లేదని, అదే సమయంలో తన మిత్రుడు విజయ్ రాజకీయ ప్రవేశం చేయడం అత్యంత సాహసోపేతమైన చర్య ఆయన ప్రశంసించారు. సినీ రంగంలో ప్రవేశించి 33 యేళ్లు పూర్తయిన సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో ప్రవేశించే సినీ కళాకారులకు తాను శుభాకాంక్షలు చెబుతానని, అంతేకాని తనకు రాజకీయాల్లో రావాలనే ఉద్దేశం మాత్రం లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో మార్పు తీసుకు రాగలమనే నమ్మకంతో రాజకీయ ప్రవేశం చేసేవారంతా విజయం సాధించాలనే కోరుకుంటానని చెప్పారు. 140 కోట్ల జనాభా కలిగిన భారతదేశం విభిన్నమతాలు, విభిన్నజాతులవారు, విభిన్నభాషలకు చెందినవారంతా సామరస్యంగా జీవిస్తున్నారని, వీరందరినీ ఏకతాటిపై నడిపించడం రాజకీయనేతలకే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రపతి భవన్‌లో పాటించాల్సిన నియమాలు, అక్కడి భద్రతా ఏర్పాట్లు చూసి తాను ఆశ్చర్యపోయానని, నాయకులంతా తమ జీవనయానాన్ని ఎలా సాగిస్తున్నారో అప్పుడే తనకు అవగతమైందన్నారు. ఆ నాయకులను చూసి తాను అసూయపడలేదని, ఓ దేశాన్ని, లేదా ఓ రాష్ట్రాన్ని భుజాలపై మోయటం కష్టసాధ్యమని తెలుసుకున్నానన్నారు. అందుకనే తాను నటుడు విజయ్ రాజకీయ ప్రవేశం చేయడం సాహసోపేతమైన నిర్ణయమని చెబుతున్నానని పేర్కొన్నారు.

ఆందోళనలో పాల్గొనే అంగన్వాడీలపై చర్యలు

● మంత్రి గీతా జీవన్

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): విధులను బహిష్కరించి ఆందోళనలో పాల్గొనే అంగన్వాడీ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలుంటాయని మంత్రి గీతా జీవన్ హెచ్చరించారు. తమిళనాడు అంగన్వాడీ ఉద్యోగులు, సహాయకుల సంఘం ఆధ్వర్యంలో మే నెలంతా వేసవి సెలవులు కావాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇందువల్ల అంగన్వాడీ కేంద్రాలు మూతపడటంతో చిన్నారులకు మధ్యాహ్న భోజనం, గుడ్లు, ఇతర పోషకాహారాలు పంపిణీ చేయలేదు.. అంగన్వాడీ ఉద్యోగులు విధులు బహిష్కరించడంపై సాంఘిక సంక్షేమశాఖ మంత్రి గీతా జీవన్ స్పందించారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, అంగన్వాడీ ఉద్యోగుల ఆందోళన కారణంగా పలు చిన్నారుల సంరక్షణ కేంద్రాలు మూతబడ్డాయి, జిల్లా ప్రజాశిక కార్యాలయాల ముందు ఆందోళనలో పాల్గొనే ఉద్యోగుల వివరాలను సంబంధిత అధికారుల ద్వారా సేకరిస్తున్నట్లు తెలిపారు. జీవో నెంబరు 117 సామాజిక సంక్షేమం, మహిళల దినం 2025 ఏప్రిల్ 30వ తేదీ ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారుల ఆరోగ్యం కోసం ఈ నెల 11 నుండి 25వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అంతేకాకుండా జాతీయ సెలవు, పండుగ రోజుల సెలవు, ఆదివారం సెలవు రోజుల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆహారం పంపిణీ యథావిధిగా వుంటుందన్నారు. వేతనం, డిఏ పెంపు తదితర రాయితీలు అందుకుంటున్న అంగన్వాడీ ఉద్యోగులు చట్టవిరుద్ధంగా ఆందోళనలో పాల్గొంటే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని మంత్రి మంత్రి హెచ్చరించారు.

ఎన్ఈపీ సూచనలు అంగీకరించం

● సీబీఎస్ఈ పాఠశాలల్లో 3,5,8 తరగతుల ఫెయిల్ ప్రక్రియను అనుమతించబోం ● రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్



పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పాఠశాలల్లో 3,5,8 తరగతుల్లో తక్కువ మార్కులు వచ్చే విద్యార్థులు ఫెయిలవుతారన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని అంగీకరించలేమని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ స్పష్టం చేశారు. తిరుచ్చి విమానాశ్రయంలో శుక్రవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... సీబీఎస్ఈ పాఠశాలల్లో 3,5,8 తరగతుల విద్యార్థుల విద్యార్థులు తక్కువ మార్కులు పొందితే వారిని ఉత్తీర్ణులుగా ప్రకటించలేమని, ఆ ప్రకారం తదుపరి సంవత్సరం కూడా ఆ విద్యార్థులు అదే తరగతిలో కొనసాగుతారని నూతన జాతీయ విద్యా విధానం పేర్కొన్నట్లు మీడియా ద్వారా తెలుసుకున్నానని వివరించారు. అందువల్లే కొత్త జాతీయ విద్యా విధానం రాష్ట్రంలో అమలుచేయబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారన్నారు. 2019లో డ్రాఫ్ట్ రూపంలో ఉన్న ప్రక్రియను కొవిడ్ కాలంలో అత్యవసరంగా జాతీయ విద్యా విధానంగా రూపొందించి, దశల వారీగా అమలుచేస్తామని కేంద్రం తెలిపిందన్నారు. జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించడం కేవలం డీఎంకే నేతలు, కార్యకర్తల పిల్లల కోసం కాదని, రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి సంబంధించిన అంశంగా గుర్తించాలన్నారు. ఫెయిలైన కింది తరగతి చిన్నారులు అదే తరగతుల్లో కొనసాగాలనే నిబంధన అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. చిన్నారులు ఫెయిలైనట్లుగా అంగీకరించాలని సీబీఎస్ఈ పాఠశాలలు ఇచ్చే ఫారంపై తల్లిదండ్రులు సంతకం చేయవద్దని, ఈ విధానాన్ని వ్యతిరేకించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఆంగ్లేయుల సమాధులు తొలగించవచ్చు

● మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలో వున్న 300 ఏళ్ళ నాటి పురాతన ఆంగ్లేయుల సమాధులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన అప్పీలు పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు ప్రాంగణంలో డాక్టర్ అంబేడ్కర్ ప్రభుత్వ న్యాయ కళాశాల ఉన్న ప్రాంతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ గవర్నర్‌గా వ్యవహరించిన ఎలిహ్యాయేల్ కుమారుడు డేవిడ్‌యేల్, ఆయన మిత్రుడు జోసెఫ్ హింరెన్స్‌ల సమాధులున్నాయి. ఈ ప్రాంతంలో ఐదంతస్థుల మల్టీలెవల్ కార్ పార్కింగ్ నిర్మించేందుకు ప్లాన్ సిద్ధం చేశారు. నిర్మాణ పనులకు అడ్డుగావున్న సమాధులను తొలగించి వేరే ప్రాంతానికి మార్చాలని కోరుతూ న్యాయవాది మనోహరన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. గతంలో ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి దండపాణి ఆ సమాధులను నాలుగు వారాల్లోగా వేరే ప్రాంతానికి మార్చాలని 2023వ సంవత్సరంలో కేంద్ర పురావస్తు శాఖకు ఆదేశించారు. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ కేంద్ర పురావస్తు శాఖ తరపున ఒకటి, సీనియర్ న్యాయవాది మనోహరన్ తరపున మరొకటి వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై హైకోర్టు న్యాయమూర్తులు ఎం.సుందర్, ఎం.సతీష్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి ఆంగ్లేయుల సమాధులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

ఈరోడ్‌లో
దంపతుల దారుణహత్య

● 15 సవర్ల నగల దోపిడి


హత్యకు గురైన రామసామి, భాగ్యమ్మాళ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా శివగిరి సమీపంలో ఓ ఫామ్‌హౌస్‌లో నివసిస్తున్న వృద్ధదంపతులను గుర్తు తెలియని దుండగులు హతమార్చి 15 సవర్ల బంగారు నగలను దోచుకెళ్ళారు. శివగిరి సమీపం విలకేత్తివెలంగాడు వలసు ప్రాంతానికి చెందిన రైతు రామసామి (75), ఆయన భార్య భాగ్యమ్మాళ్ (65) తమకు చెందిన ఫామ్‌హౌస్‌లో నివసిస్తున్నారు. వీరి కుమారుడు కవిశంకర్ ముత్తూరులో కుటుంబ సమేతంగా నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఫామ్‌హౌస్‌లో ఉన్న రామసామికి ఆయన కుమారుడు కవిశంకర్ రెండు రోజులుగా ఫోన్ చేసినా ఫోన్ తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన కవిశంకర్ ఆ ఫామ్‌హౌస్ చుట్టుపక్కల నివసిస్తున్న వారికి ఫోన్ చేసి తన తల్లిదండ్రులను పలకరించి తనకు ఫోన్ చేయమని తెలిపారు. ఆ మేరకు గురువారం రాత్రి స్థానికులు ఆ ఫామ్‌హౌస్‌లోకి వెళ్ళి చూసినప్పుడు రామసామి ఇంటిలోపల, ఆయన భార్య భాగ్యమ్మాళ్ ఇంటి బయట కత్తిపోట్లతో శవాలుగా పడి ఉన్నారు. దిగ్భ్రాంతి చెందిన స్థానికులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈరోడ్ ఎస్పీ సుజాత సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్ళి పరిశీలించారు. భాగ్యమ్మాళ్ మెడలోని మంగళసూత్రం, గొలుసు, చేతికి వేసుకున్న గాజులను దుండగులు దోపిడీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

ఈపీఎస్ ఖండన...

ఈ హత్యాసంఘటనపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీఎంకే పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పటానికి ఈరోడ్ జిల్లాలో జరిగిన వృద్ధ దంపతుల దారుణహత్యే చక్కటి ఉదాహరణ అన్ని అన్నారు. హంతకులను కనుగొని శిక్షించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

నీట్‌పై సీఎం క్షమాపణ చెప్పాలి

● అన్నాడీఎంకే డిమాండ్


సమావేశంలో అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి పళనిస్వామి తదితరులు

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): నీట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రప్రజలకు, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే డిమాండ్ చేసింది. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ ప్రిసీడియం చైర్మెన్ తమిళ్ మగన్ హుస్సేన్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. 375 మంది కార్యవర్గ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశం మొత్తం 16 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, రాష్ట్ర నిర్వాహకులు కేపీ మునిస్వామి, నత్తం విశ్వనాథన్, ఎస్‌పీ వేలుమణి, దిండుగల్ శ్రీనివాసన్ మాజీమంత్రులు సెంగోటయ్యన్, డి.జయకుమార్ తదితరులు తీర్మానాలను సభకు వినిపించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిని ఇంటికి సాగనంపాలన్న ఏకైక లక్ష్యంతో అన్నాడీఎంకే సారథ్యంలో మెగా కూటమి ఏర్పడేందుకు కృషిచేసిన ఈపీఎస్‌ను ఈ సమావేశం అభినందించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రప్రజలకు డీఎంకే 525 హామీలు ఇచ్చిందని, వాటిలో 15 శాతం కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ నిరసన వ్యక్తంచేసింది. నీట్ రద్దు వ్యవహారంలో కపటనాటకం ఆడుతున్న డీఎంకే ప్రభుత్వం రాష్ట్రప్రజలకు, విద్యార్థిలోకానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. 15వ తీర్మానంలో అన్నాడీఎంకే వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్, పురట్చి తలైవి జయలలిత బాటలో పయణిస్తూ పార్టీలో ఐక్యతను పెంచుతూ బలోపేతం చేస్తున్న ఈపీఎస్‌ను 2026వ సంవత్సరంలో మళ్ళీ సీఎంను చేయాలని, ఇందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఈ సమావేశం కోరింది.

ఈదురు గాలులకు అరటి చెట్ల ధ్వంసం


నేలకొరిగిన అరటి చెట్లు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ సమీపంలో గురువారం రాత్రి ఈదురుగాలులకు సుమారు 50వేల అరటి చెట్లు ధ్వంసం కాగా, 30 కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. కోవై సమీపం సిరుముగై, లింగాపురం, గంధవయల్, వాసిన్‌పాళయం, పాలపట్టి, మొక్కైమేడు తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో, రోడ్లపై వరద నీరు ప్రవహించింది. భారతినగర్, థియేటర్‌మేడు, రంగంపాళయం తదితర ప్రాంతాల్లోని చెట్లు రోడ్లపై విరిగి పడడంతో సుమారు గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే, సిరుముగైనగర్ సహా పలు ప్రాంతాల్లో చెట్లు పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో, ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సిరుముగై, లింగాపురం గంధవయల్ సహా పలు ప్రాంతాల్లో సుమారు 50 వేల అరటి చెట్లు నేలకొరిగాయి. కోతకు వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యానికి భారీగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరువేర్కాడు ఆలయానికి కొత్త రాజగోపురాలు

● నిర్మాణ పనుల ప్రారంభం


రాజగోపురాల నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, నాజర్

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరువేర్కాడు దేవి కరుమారియమ్మన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు జరుగనుండటంతో ఆ ఆలయానికి కొత్తగా మూడు రాజగోపురాల నిర్మాణ పనులను శుక్రవారం ఉదయం మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎస్ఎం నాజర్ ప్రారంభించారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయ కుంభాభిషేకం కోసం ప్రస్తుతం బాలాలయం నిర్మించి జీర్ణోద్ధరణ జరుపుతున్నారు. ఆ పనులలో భాగంగా రూ.17.47 కోట్లతో మూడు కొత్త రాజగోపురాలు, రెండు ముఖ మండపాలు నిర్మించనున్నారు. ఈ పనులకు మంత్రులిద్దరూ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ తిరువేర్కాడు దేవి కరుమారియమ్మన్ ఆలయ జీర్ణోద్ధరణ పనులకు రూ.70.27 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఆలయ నిధుల్లో రూ.6 కోట్లతో గర్భాలయం, అర్ధమండపం, మహామండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇదేవిధంగా రూ.4.80 కోట్లతో అన్నదాన మండపం నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఆవడి కార్పొరేషన్ మేయర్ ఉదయకుమార్, తిరువేర్కాడు నగర పంచాయతీ అధ్యక్షుడు మూర్తి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ డెక్కాన్ ఎన్‌కే మూర్తి, డిప్యూటీ కమిషనర్ అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

వీధి శునకాలను ఎలా కట్టడి చేద్దాం?

● సీఎం స్టాలిన్ నేతృత్వంలో కీలక భేటీ ● పాల్గొన్న పలువురు మంత్రులు


సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

అడయార్, మే 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వీధి కుక్కల దాడులను ఎలా అరికట్టాలన్న అంశంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ.పెరియస్వామితో పాటు చెన్నై నగర కార్పొరేషన్ కమిషనర్, ఆయా శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. గత కాలంగా వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రోడ్లపై నడిచి వెళుతున్న వృద్ధులు, చిన్నారులు, మహిళలపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట ఈ శునకాల బెడద మరింత ఎక్కువగా ఉంది. ఈ కుక్కల దాడిలో పలువురు చిన్నారులు, వృద్ధులు, మహిళలు గాయపడిన సందర్భాలు లేకపోలేదు. ఇదిలావుంటే, చెన్నై నగరంలో ప్రభుత్వ గణాంకాల మేరకు 2018 లెక్కల ప్రకారం 1.30 వేల వీధి కుక్కలున్నాయి. ఈ నేపథ్యంలో వీధి కుక్కలు దాడి చేయకుండా వాటిని ఏ విధంగా కట్టడి చేయాలన్న అంశంపై ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో వీధి కుక్కలకు కు.ని చేయడం, వీటిపై నిఘా వేసి ఉంచడం, ర్యాబిస్ ఇంజెక్షన్లు వేయడం తదితర అంశాలపై ఇందులో చర్చించారు.

సమాచార దృశ్మిని

యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగ అవకాశాలు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్‌లో స్పెషల్ ఆఫీసర్లు, లోన్ అసిస్టెంట్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్(ఐటీ)తదితర 500 పోస్టులు భర్తీ చేయనున్నారు. సీఏ, సీఎంఏ, డిగ్రీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఆసక్తి కలిగి అర్హత ఉన్న వారు ఈ నెల 20వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలకు www.unionbankofindia.co.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

5న కోయంబేడు మార్కెట్‌కు సెలవు

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోయంబేడు మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది మే 5వ తేదీ వ్యాపారుల దినంగా జరుపుకుంటున్నారు. ఆ రోజు వ్యాపారుల సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందువల్ల వ్యాపారుల సంఘాల పిలుపు మేరకు కిరాణా షాపులను మూసివేసి ప్రత్యేక కార్యక్రమాల్లో వ్యాపారులు పాల్గొంటుంటారు. ఆ రీతిలో కోయంబేడు హోల్‌సేల్ వ్యాపారుల సంఘ అధ్యక్షుడు ఎస్‌ఎస్ ముత్తుకుమార్ ఈ నెల 5వ తేదీ ఈ మార్కెట్ పనిచేయదని ఓ ప్రకటనలో తెలిపారు.

కోవై-ఊటీ మధ్య 20 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకార్యర్థం కోవై-ఊటీ మధ్య 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది. ప్రముఖ పర్యాటక కేంద్రం ఊటీకి రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వేసవి సెలవుల్లో ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటోంది. ఈ క్రమంలో, ఊటీలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా హైకోర్టు ఉత్తర్వులతో పర్యాటకుల వాహనాలకు ఈ-పాస్ తప్పనిసరి చేశారు. ప్రస్తుతం కోవై మేట్టుపాళయం రోడ్డు సమీపంలో కొత్త బస్టాండ్ నుంచి ఊటీ, కున్నూర్, కోతగిరి, కూడలూరు తదితర ప్రాంతాలకు ప్రతిరోజు 65 బస్సులు నడుపుతున్నారు. వేసవి సెలవుల దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం కోవై-ఊటీ మధ్య 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

డిజిటల్ విధానంలో 'పార్కింగ్' ఫీజు వసూలు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జీసీసీ పరిధిలో మెరీనా బీచ్ సర్వీస్ రోడ్డు, అన్నా నగర్, నుంగంబాక్కం సహా 10 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ వసతి ఉండగా, ఓ ప్రైవేటు సంస్థ ద్వారా పార్కింగ్ ఫీజు వసూలుచేస్తున్నారు. ప్రస్తుతం ఆ సంస్థ గడువు ముగియడంతో, తమిళనాడు మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కింగ్ ఫీజు వసూలుచేస్తున్నారు. ఆ ప్రకారం, ద్విచక్రవాహనాలకు గంటకు రూ.5, ద్విచక్రవాహనాలకు రూ.20, బస్సులు, వ్యాన్ తదితరాలకు రూ.60 వసూలుచేస్తున్నారు. వాహనదారులు డిజిటల్ విధానంలో మాత్రమే ఫీజు చెల్లించాలని, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి '1913' నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.9928 కోట్లతో కోయంబేడు-పట్టాభిరాం మెట్రో

- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు నుంచి పట్టాభిరాం వరకు రూ.9,928 కోట్లతో మెట్రో రైలు ప్రాజెక్ట్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ ప్రకారం, కోయంబేడు నుంచి పట్టాభిరాం ఔటర్ రింగ్ రోడ్డు వరకు 27.16 కి.మీ రైలు మార్గం నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో హైవేపై రూ.40 కోట్లతో మూడు ఫ్లై ఓవర్లు నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో చేపట్టేలా ప్రాజెక్ట్ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

కొత్త విద్యా విధానం ప్రకారం పాఠ్యాంశాలు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా విశ్వవిద్యాలయాలు తమ పాఠ్యాంశాలు రూపొందించాలని యూజీసీ ఆదేశించింది. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి వర్సిటీలకు పంపిన సర్క్యులర్‌లో... ఆలోచనలు, ఆవిష్కరణలు, సాంకేతికత కారణంగా ప్రపంచం వేగంగా మారుతోంది. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో కూడా మార్పులు రావాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగా జాతీయ విద్యా విధానం-2020 పాఠ్యాంశాల్లో సమగ్ర వివరణ, బలమైన మార్పులు చేపట్టినట్లు, ఇది 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా విద్యను సమగ్రంగా, సరళంగా, ప్రతిస్పందించేలా రూపొందించినట్లు, కొత్త విద్యా విధానానికి అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించాలని యూజీసీ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

మెట్రోలో 87.59 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో గత నెల (ఏప్రిల్)లో 87,59,587 లక్షల మంది ప్రయాణించారు. ఆ నెల 30వ తేది అధికంగా 3,49,675 మంది ప్రయాణించారు. 'ట్రావెల్ కార్డ్ ద్వారా 6.15.850 మంది, టోకెన్ల ద్వారా 1,447, గ్రూప్ టిక్కెట్ ద్వారా 128, క్యూ ఆర్ ద్వారా 39,11,883 (ఆన్‌లైన్ క్యూఆర్ ద్వారా 1,45,753, పేపర్ క్యూ ఆర్ ద్వారా 19,12,904, స్టాటిక్ క్యూ ఆర్ ద్వారా 2,65,878, వాట్సాప్ ద్వారా 5,83,351, పే టీఎం ద్వారా 4,09,358, ఫోన్ పే ద్వారా 3,29,782, ఓఎన్‌డీసీ ద్వారా 2,64,781), సింగార చెన్నై కార్డు ద్వారా 42,30,279 మంది మెట్రోరైళ్లలో ప్రయాణించారు. కాగా, క్యూ ఆర్ కోడ్ టిక్కెట్, ట్రావెల్ కార్డ్, వాట్సాప్ (+91 8300086000) పే టీఎం, ఫోన్ ద్వారా, సింగార చెన్నై కార్డు ద్వారా ప్రయాణించే వారికి 20 శాతం రాయితీ కల్పిస్తున్నారు. కాగా, గత మార్చి నెలలో మెట్రోరైళ్లలో 92,10,069 మంది ప్రయాణించినట్లు సీఎంఆర్‌ఎల్ ఒక ప్రకటనలో తెలిపింది.

పెరిగిన ఉప్పు ఉత్పత్తి...వ్యాపారుల హర్షం



పెరంబూర్, మే 2: ఎండల కారణంగా ఉప్పు ఉత్పత్తి పెరగడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విల్లుపురం జిల్లా మరక్కాణం, పరిసర ప్రాంతాల్లో సుమారు 3,500 ఎకరాల్లో ఉప్పు సాగుచేస్తున్నారు. ఏడాదికి సుమారు 25 లక్షల టన్నుల ఉప్పు ఉత్పత్తి చేస్తుండగా, పొరుగు జిల్లాలు, ఆంధ్ర, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ ప్రాంతంలో తయారయ్యే ఉప్పు వంటల్లో మాత్రమే వినియోగించేలా ఉండడం విశేషం. ఈ రంగంపై ఆధారపడి సుమారు 4 వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం ఎండల కారణంగా ఉత్పత్తి ముమ్మరంగా సాగుతోంది. 100 కిలోల బస్తా ధర రూ.500 వరకు పలుకుతుండడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పు మళ్లలో పనిచేస్తున్న కార్మికుడు

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలైకు వివిధ నగరాల నుంచి 2,100 బస్సులు నడుపనున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం అరుణాచలేశ్వర ఆలయంలో ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. అందులోనూ, చిత్రా పౌర్ణమి ఇతర పౌర్ణమి రోజుల కంటే విశిష్టమైనదని భావిస్తున్న లక్షలాది మంది భక్తులు ఆ రోజు గిరి ప్రదక్షిణ చేసేందుకు వస్తుంటారు. చిత్రా పౌర్ణమి ఘడియలు ఈ నెల 11న రాత్రి 8.01 గంటలకు ప్రారంభమై, మరుసటిరోజు రాత్రి 10.25 గంటలకు ముగియనున్నాయి. ఆ ఘడియల్లో సుమారు 20 లక్షల మంది గిరి ప్రదక్షిణ చేసే అవకాశముందని జిల్లా యంత్రాంగం భావించి, తగిన వసతులు సమకూర్చుతోంది. ఈ నేపథ్యంలో, చిత్రా పౌర్ణమి సందర్భంగా చెన్నై, విల్లుపురం, కాంచీపురం, వేలూరు, పుదుచ్చేరి, తిరుచ్చి, కడలూరు, సేలం, కుంభకోణం, ధర్మపురి సహా పలు నగరాల నుంచి రోజూ నడిపే బస్సులతో పాటు 2,100 ప్రత్యేక బస్సులు నడుపున్నారు. 10వ తేది రాత్రి నుంచి 12వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయని, ప్రజలు ముందుగా రిజర్వేషన్ చేసుకొని, సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

'నిప్పాన్' ఆధ్వర్యంలో పెయింటర్లకు సత్కారం



ఓ పెయింటర్‌కు కానుకల సంచిని అందజేసి సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): పెయింట్స్ తయారీలో పేరుగడించిన నిప్పాన్ పెయింట్స్ సంస్థ ప్రపంచ చిత్రకారుల ప్రశంసా దినోత్సవం సందర్భంగా నగరంలోని పెయింటర్లను ఘనంగా సత్కరించింది. దేశవ్యాప్తంగా గృహాలు, కర్మాగారాలు ఇతర భవనాలకు రంగులు వేయడంలో పెయింటర్లు కీలక పాత్ర వహిస్తారని, కనుకనే వారి శక్తి సామర్థ్యాలను ఎలుగెత్తి చాటేందుకే సత్కరిస్తున్నట్లు సంస్థ డెకరేటివ్ బిజినెస్ చైర్మన్ మహేష్ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిప్పాన్ పెయింట్స్‌తో ఇళ్లకు, నిర్మాణాలకు ఆకర్షణీయమైన రంగులు వేసిన పెయింటర్స్‌ను విలువైన కానుకలతో సత్కరించారు.

నష్టాల బారిన 'క్యారెట్' రైతులు



కేత్తి పాలాడ నది పక్కన రైతులు పారబోసిన క్యారెట్

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): దిగుబడులు పెరగడంతో మంచి ఆదాయం వస్తుందనుకున్న క్యారెట్ రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మార్కెట్లో క్యారెట్ కొనుగోలు ధరలు బాగా తగ్గిపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీలగిరి జిల్లా ఊటీ, కున్నూర్, కోతగిరి తదితర కొండ ప్రాంతాల్లో రైతులు అధికంగా క్యారెట్ సాగుచేస్తున్నారు. ప్రస్తుతం క్యారెట్ కిలో రూ.12-రూ.25 మాత్రమే వస్తోంది. అందులోనూ మొదటి రకం క్యారట్ మాత్రమే చెన్నై, మదురై, పుదుచ్చేరి ప్రాంతాల వ్యాపారులు తీసుకెళ్తున్నారు. ఇక, రెండు, మూడవ రకం క్యారెట్ రూ.7 లోపే ధర పలుకుతోంది. ఈ ధరకు విక్రయిస్తే తమకు రవాణా ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు, మార్కెట్‌కు తీసుకొచ్చిన క్యారట్ మళ్లీ తీసుకెళ్లలేక కేత్తి సమీపంలో పాలాడా నది తీరంలో పడేసి తిరుగుముఖం పడుతున్నారు.

భద్రత ఉపసంహరించిన ప్రభుత్వం

- నా ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సహాయం

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తనకు కల్పించిన భద్రతను ఉపసంహరించుకుందని, తన ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉండటంతో మదురై కోర్టులో హాజరుకాలేకపోయానని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సహాయం పేర్కొన్నారు. సహాయం మదురై జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు గ్రానైట్ కంపెనీల్లో జరిగిన అవినీతి అక్రమాలను బయటపెట్టారు. నిజాయితీకి మారుపేరైన సహాయంను పలుమార్లు పలు ప్రాంతాలకు బదిలీ చేశారు. 2021లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సహాయం రాజకీయ ప్రవేశం చేశారు.



మాజీ ఐఏఎస్ అధికారి సహాయం

2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ప్రారంభించిన పార్టీ అభ్యర్థులంతా ఓటమిపాలయ్యారు. గ్రానైట్ క్వారీ లో జరిగిన అవినీతి అక్రమాలపై మదురై కోర్టులో విచారణ జరుగుతోంది. ఇటీవల జరిగిన ఆ కోర్టు ఆ విచారణకు సహాయం హాజరుకాలేదు. ఈ విషయమై ప్రభుత్వ న్యాయవాదికి ఓ లేఖ పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం తనకు కల్పించిన భద్రత రెండేళ్ల క్రితమే ఉపసంహరించుకుందని, ప్రస్తుతం తన ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశంఉండటంతో విచారణకు హాజరుకాలేకపోయానని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదయ్యే టీచర్లపై సస్పెన్షన్ వేటు

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులు నమోదయ్యే ప్రభుత్వ పాఠశాలల టీచర్లను నాలుగు రోజుల్లోపు సస్పెండ్ చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వం పాఠశాల విద్యాశాఖను ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులపై లైంగిక వేధింపులను అడ్డుకునేలా ప్రభుత్వం చట్టాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేందుకు సిద్ధపడింది. ఇలాంటి చర్యలకు పాల్పడిన ప్రభుత్వ టీచర్లను విచారణ అనంతరం పోక్సో చట్టం కింద అరెస్టు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, బోధనేతర సిబ్బంది తదితరులు లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదు నమోదు చేసినట్లయితే వారిని నాలుగు రోజుల్లోపు సస్పెండ్ చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంతే కాకుండా ఫిర్యాదులకు సంబంధించి డీసీపీవో ప్రాథమిక విచారణ జరిపి, నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. కాగా, పోలీసుల విచారణకు దీటుగా డీసీపీవో విచారణ ఉంటుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగిని

తిరుత్తణి, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా సమతువపురంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ గ్రామ పరిపాలనాధికారిణిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. సమతువపురం గ్రామాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న కోటేశ్వరి అనే ఉద్యోగిని నూతనంగా నిర్మించుకునే ఇళ్లకు ఆన్‌లైన్ పట్టా ఇప్పిస్తానని చెప్పి, ఒక్కో ఇంటికి రూ.5వేలు చొప్పున లంచం తీసుకున్నట్లుగా సమతువపురం హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదనన్ బృందం గమనించి, ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారి డీఎస్పీ గణేశన్ నేతృత్వంలోని బృందం ఆమె దగ్గర నుంచి రూ.75వేలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

కళ్లలగర్ ఆలయ ఉత్సవాలకు

సిద్ధమవుతున్న వాహనాలు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అళగర్ కోవిల్ కళ్లలగర్ చిత్తిరై ఉత్సవాల సందర్భంగా కళ్లలగర్ ఆగమనం కోసం బంగారు అశ్వ వాహనానికి తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఈ నెల 8 నుంచి 17వ తేది వరకు నిర్వహించనున ఈ ఉత్సవాలను పురస్కరించుకుని గత నెల 27వ తేది తల్లాకుళం ప్రసన్న వెంకటాచలపతి ఆలయంలో ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం జరిగింది. ఈ నెల 12న కళ్లలగర్ వైగై నది వద్దకు బంగారు అశ్వ వాహనంలో వేంచేస్తారు. 13న వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో శేష వాహనంపై బయల్దేరుతారు. అదే రోజున గరుడ వాహనంపై మండూక మహర్షికి మోక్షం ప్రసాదించే వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మూడు వాహనాలు కళ్లలగర్ ఆలయంలో గదుల్లో భద్రపరుస్తుంటారు. చిత్తిరై ఉత్సవాల సందర్భంగా ఏడాదికి ఒక సారి మాత్రమే ఈ వాహనాల్లో కళ్లలగర్ వేంచేస్తుంటారు. ప్రస్తుతం మూడు వాహనాలను బయటకు తీసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరణ ప్రారంభించారు.



బంగారు అశ్వ వాహనానికి తుది మెరుగులు

రాష్ట్ర ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థకు రూ.570 కోట్ల జీఎస్టీ

- నోటీసుపై స్టే విధించిన హైకోర్టు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్ను రూ.258 కోట్ల జరిమానా చేర్చి రూ.570 కోట్లు చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థకు జీఎస్టీ కమిషన్ పంపిన ఉత్తర్వులపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. 2017 నుంచి 2022 వరకు కేబుల్ టీవీ ఆపరేటర్లు చెల్లించాల్సిన జీఎస్టీ, రూ.285 కోట్ల 4 లక్షల 79 వేల 342 జరిమానాతో చేర్చి రూ.570 కోట్లు చెల్లించాలని జీఎస్టీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థకు నోటీసులు పంపింది. దానిని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. పిటిషన్‌లో... మల్టీ సిస్టమ్ ఆపరేషన్ అనే విధానంతో ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ, స్థానిక టీవీ ఛానళ్ల సిగ్నల్స్ కేబుల్ ఆపరేటర్లకు ఇస్తోంది. స్థానిక టీవీ ఆపరేటర్లు ఆ సిగ్నల్స్‌ను వినియోగదారులకు ఇస్తున్నారు.. వినియోగదారుల నుంచి కేబుల్ టీవీ ఆపరేటర్లు వసూలుచేసే నగదులో ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ సమాన ఆదాయం సమకూరుతోంది. అందుకు సంబంధించిన జీఎస్టీ బకాయిలు లేకుండా చెల్లిస్తున్నాము. స్థానిక కేబుల్ టీవీ ఆపరేటర్లు, వారికి సంబంధించిన జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అందుకు ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ బాధ్యత వహించదు. అందువల్ల, రూ.28 కోట్ల జరిమానాతో కలిపి రూ.570 కోట్లు చెల్లించాలనే జీఎస్‌టీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులకు స్టే విధించాలంటూ పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్ న్యాయమూర్తి కృష్ణన్ రామస్వామి విచారించగా, ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది విల్సన్... కేబుల్ టీవీ ఆపరేటర్ల ఆదాయం, ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ ఆదాయంగా పరిగణించలేరన్నారు. జీఎస్టీ కమిషన్ ఇచ్చిన నోటీసుకు తగిన సంజాయిషీ ఇచ్చినా, దానిని పరిశీలించకుండా ఉత్తర్వులు జారీచేసిందని వాదించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి, రూ.570 కోట్లు తమిళనాడు ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ చెల్లించాలనే జీఎస్టీ కమిషన్ ఉత్తర్వులకు స్టే విధించారు.

కుటుంబీకుల ఘర్షణ నడుమ తిరుత్తణిలో ప్రేమ వివాహం



ఘర్షణ పడుతున్న కుటుంబీకులను పట్టించుకోకుండా దండలు మార్చుకుంటున్న ప్రేమజంట

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఇరువైపు కుటుంబీకుల ఘర్షణ నడుమ ఓ ప్రేమజంట వివాహం చేసుకుంది. ఇద్దరూ మేజర్లు కావడంతో వీరి పెళ్లికి పోలీసులు పచ్చజెండా ఊపారు. వివరాలిలా... పొదట్టూరుపేటకు చెందిన సుందరం కుమారుడు ఉమాపతి (21), బొవ్వు రాజు పేటకు చెందిన హేమాచలం కుమార్తె రీటా (19) ఆర్కేపేట ప్రైవేటు కాలేజీలో చదువుకున్న సమయంలో ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను కుటుంబీకులు తీవ్రం గా వ్యతిరేకించారు. ఆ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఈ ప్రేమజంట తిరుత్తణి ఆలయానికి వెళ్లి రహస్యంగా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించింది. ఆ విషయం ఎలాగో పసిగట్టిన ఇరువైపు కుటుంబీకులు, బంధువులు కొండమీదికి చేరుకున్నారు. అప్పటికే ప్రేమజంట ఆలయ ప్రవేశద్వారం ఎదుట పెళ్లికి సిద్ధమయ్యింది. అది చూసి మండిపడ్డ ఇరువైపు కుటుంబీకులు ఆ జంటను విడదీయడానికి బదులుగా ఒకరిపై ఒకరు దూషించుకుంటూ కొట్టుకున్నారు. అదే అనువైన సమయంగా భావించిన ఉమాపతి తన ప్రేమికురాలు మెడలో తాళి కట్టేశాడు. ఇద్దరం పెళ్లి చేసుకున్నామని ఆ జంట కేకలు పెట్టడంతో వారి కుటుంబీకులు కొట్లాటకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అప్పటికి ఆగ్రహం తీరని కుటుంబీకులు తిరుత్తణి మహిళా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ఆ పెళ్లి అంగీకరించదని ప్రకటించమని వేడుకున్నారు. పోలీసులు విచారణ జరిపి ఇద్దరూ మేజర్లే అని తెలుసుకుని వారి పెళ్లి చట్టబద్ధమేనని ప్రకటించారు. ఇరువైపు కుటుంబీకులను మందలించారు. ఆ తర్వాత ఆ జంట కొండ మీది దేవుడిని దర్శించేందుకు వెళ్లడం చూసి కుటుంబీకులు అవాక్కయ్యారు.

రూ.6732 కోట్లకు పెరిగిన సీయూబీ ఆదాయం



- సీఈఓ డాక్టర్ ఎన్. కామకోడి

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): గత మార్చితో ముగిసిన నాలుగవ త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకారం సిటీ యూనియన్ బ్యాంక్ ఆదాయం రూ.6732 కోట్లకు పెరిగిందని, ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 12 శాతం అధికమని ఆ బ్యాంక్ సీఈఓ, ఎండీ డాక్టర్ ఎన్.కామకోడి అన్నారు. శుక్రవారం జరిగిన బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నాలుగవ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ఆమోదించినట్లు ఆయన చెప్పారు. బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా 11 శాతం పెరిగి 5834 కోట్లకు చేరిందని, నికర వడ్డీ ఆదాయం కూడా 9 శాతం పెరిగి రూ.2316 కోట్లకు చేరిందని ఆయన వివరించారు. బ్యాంక్ డిపాజిట్లు కూడా గణనీయంగా పెరిగాయని, గత ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లు రూ.55,657 కోట్ల మేర ఉండేవని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.63,526 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇక గత యేడాది రూ.46,481 కోట్ల మేరకు బ్యాంక్ రుణాలు మంజూరు చేసిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.53,066 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేసిందని వివరించారు.

1.80 లక్షల వీధి శునకాలకు రేబిస్ టీకాలు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 1.80 లక్షల వీధి శునకాలకు రేబిస్, నులిపురుగల నివారణ టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ మేరకు జీసీసీ మేయర్ ప్రియ మాట్లాడుతూ... నగరంలో సంచరిస్తున్న వీధి శునకాలు ప్రజలపై దాడిచేస్తున్న ఘటనలు అధికమవుతున్నాయని, వీటిని అరికట్టేలా చర్యలు చేపట్టామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 5 ప్రాంతాల్లో కుక్కల నియంత్రణ కేంద్రాలున్నాయని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 26,760 వీధి శునకాలను పట్టుకుని, వీటిలో 20,505 శునకాలకు స్టెరిలైజేషన్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో 16 శునకాలను బంధించే వాహనాలున్నాయని, త్వరలో మరో 11 వాహనాలు కొనుగోలు చేయనున్నట్లు మేయర్ తెలిపారు.

ప్రమాదంలో చిక్కుకున్న మదురై ఆధీనం కారు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాటాన్‌కొళత్తూర్‌లోని ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో శనివారం అంతర్జాతీయ శైవ సిద్ధాంత మహానాడు జరుగనుంది. మహానాడులో ధరుమపురి ఆధీనం, మదురై ఆధీనం సహా పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ మహానాడులో పాల్గొనేందుకు శుక్రవారం మదురై ఆధీనం కారులో చెన్నై బయల్దేరారు. ఉళుందూర్ పేట సమీపంలో మదురై ఆధీనం వస్తున్న కారు మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం ప్రమాదానికి గురైన కారులోనే మదురై ఆధీనం చెన్నై బయల్దేరారు. కాగా, మదురై ఆధీనం కారు ప్రమాదం ఒక ప్రణాళికాబద్ధమైన కుట్ర అని, కారు దెబ్బతిన్నా, దేవుడి దయవల్ల మదురై ఆధీనం సురక్షితంగా బయటపడ్డారని, ఆయనను తగిన రక్షణ కల్పించాలని ధరుమపురి ఆధీనం పేర్కొన్నారు.

తప్పించుకున్న ఖైదీ... ఇద్దరు ఎస్ఐలు సస్పెన్షన్

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఖైదీ తప్పించుకున్న ఘటనలో ఇద్దరు ఎస్ఐలపై సస్పెన్షన్ వేటుపడింది. తిరుచ్చి పాలక్కరై కూనిబజార్‌కు చెందిన అబ్దుల్ ఖాదర్‌ను ఈ నెల 27వ తేది సెల్‌ఫోన్ చోరీ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించారు. అబ్దుల్ ఖాదర్‌ను కోర్టు నుంచి బయటకు తీసుకొచ్చిన పోలీసులు, వాహనం కోసం ఎదురుచూస్తున్న సమయంలో అబ్దుల్ ఖాదర్ తప్పించుకు పారిపోయాడు. మూడు రోజుల క్రితం ఈ ఘటన జరుగ్గా, గురువారం ఉరైయూర్‌లో అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ ఖాదర్ తప్పించుకున్న సమయంలో విధుల్లో ఉన్న ఎస్ఐలు గోకుల్‌దాస్, ప్రేమ్‌కుమార్‌లను సిటీ పోలీస్ కమిషనర్ కామిని సస్పెండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సెయింట్ మేరీస్ పాఠశాల నిర్వాహకులు



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

తిరుత్తణి, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ హైస్కూల్ నిర్వాహకులు ఆ పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాల ప్రాంగణంలో ఉన్న వీధుల్లో విద్యార్థులచేత శుభ్రం చేయించారు. ఈ క్రమంలో పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రతలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో అదనపు భవనాలు, ల్యాబ్‌లకు రూ.118 కోట్లు

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో అదనపు భవనాలు, ల్యాబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.118 కోట్లు కేటాయించింది. ఆ ప్రకారం, 31 జిల్లా ఆస్పత్రులు, తాలూకా ఆస్పత్రుల్లో అదనపు భవనాల నిర్మాణాలకు రూ.108 కోట్లు, 10 జిల్లాల్లో అత్యాధునిక పరికరాలు, వసతులతో కూడిన ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.10.72 కోట్లు విడుదల చేసినట్లు ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై సుబ్రహ్మణ్యుడి చిద్విలాసం



తిరుత్తణి, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ క్షేత్రంలో గురువారం నుండి ప్రారంభమైన చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవళ్లీ దేవసేన సమేతుడై సుబ్రహ్మణ్యస్వామి వెండి సూర్యప్రభ వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం తెల్లవారుజాము 5 గంటల నుండే భక్తులు పెద్దసంఖ్యలో క్యూలైన్లలో వేచివుండి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఉత్సవమూర్తులను వెండి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి, ప్రత్యేకంగా అలంకరించారు.



చిత్రజ్యోతి

'ఐ యామ్ వెయిటింగ్' అంటున్న దక్షణ్ విజయ్



దక్షణ్ విజయ్, అప్పుకుట్టి

'కబలిహారం' ఫేం దక్షణ్ విజయ్, మురుగ అశోక్‌లు కథానాయకులుగా నటిస్తున్న చిత్రానికి 'ఐ యామ్ వెయిటింగ్' అనే టైటిల్ ఖరారు చేశారు. మగిళ్ ప్రొడక్షన్స్ పతాకంపై సి.బ్యూలా నిర్మాణ సారథ్యంలో ఎన్‌వీ ఇస్మాయిల్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ చిత్రం గురించి దర్శకుడు ఇస్మాయిల్ వివరిస్తూ, 'ఐ యామ్ వెయిటింగ్ అనేది మాంసం దుకాణం నడుపుతున్న పేద కుటుంబంలో జన్మించిన అన్నాచెల్లెలు చుట్టూ తిరుగుతుంది. వర్ధమాన యాక్షన్ హీరో దక్షణ్ విజయ్ ఎన్నో రిస్కులు తీసుకుని, హాలీవుడ్ స్థాయిలో పోరాట సన్నివేశాల్లో నటించారు. ఇతర పాత్రల్లో అప్పుకుట్టి, ఇమాన్ అన్నాచ్చి, సత్య టీవీ ముక్తార్, కూల్ సురేష్, శ్రీధర్, జీవా, దీప, హలో కందస్వామి, నమో నారాయణన్, సత్య తదితరులు పోషించారు. ఏఆర్ రెహ్మాన్ సోదరి ఏఆర్ రెహానా సంగీత స్వరాలు సమకూర్చారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసి నిర్మాణాంతర పనులు జరుపుతున్నాం. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'అని పేర్కొన్నారు.

జై హీరోగా 'వర్కర్'



కన్నడంలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'సీజర్', త్వరలోనే విడుదలకు సిద్ధంగా ఉన్న 'హంటర్' చిత్రాలకు దర్శకత్వం వహించిన వినయ్ కృష్ణ తాజాగా దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి 'వర్కర్' అనే పేరు ఖరారు చేశారు. శ్రామికుల దినోత్సవం (మే డే)ను పురస్కరించుకుని టైటిల్ ప్రకటించారు. ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. వీరితో ప్రముఖ హీరోయిన్ కూడా ఓ కీలక పాత్ర పోషించనున్నారు. రొమాన్స్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో, విభిన్నమైన కథాంశంతో ఈ మూవీని తెరకెక్కించనున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు వినయ్ కృష్ణ మాట్లాడుతూ, 'ఇది పూర్తిగా ప్రేమకథ అయినప్పటికీ రొమాన్స్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో ఇంతకుముందు ఎపుడూ చూడని ఫాంటసీ కథగా తెరకెక్కిస్తున్నాం. ఈ స్క్రీన్‌ప్లే ప్రారంభం నుంచి చివరి వరకు ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. చెన్నై, పాండిచ్చేరి, మైసూర్, మంగళూరులలో షూటింగ్‌కు ప్లాన్ చేస్తున్నాం' అని వివరించారు.

సమాజంలో మార్పు తెచ్చే చిత్రం 'ఎన్ కాదలే'



'ఎన్ కాదలే'లో ఓ దృశ్యం

స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'ఎన్ కాదలే' చిత్రం సమాజంలో మార్పును తెచ్చేదిగా ఉంటుందని చిత్ర దర్శకురాలు జయలక్ష్మి అంటున్నారు. స్కై వాండర్స్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానరుపై జయలక్ష్మి సొంతంగా నిర్మించడంతో పాటు కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఇందులో హీరో హీరోయిన్లుగా లింగేష్, లండన్‌కు చెందిన లియా నటించారు. ఈ నెల 9న చిత్రం విడుదలకానుంది. ఈ చిత్రం గురించి దర్శకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ, 'చిత్రపరిశ్రమలో విజయపథంలో నడిచేవారికి మాత్రమే రెడ్ కార్పెట్ పరుస్తారు. కానీ, నా పరిస్థితి ఇందుకు విరుద్ధం. నేను 63 యేళ్ళ వయసులో దర్శకత్వ బాధ్యతలు చేపట్టి, ఈ చిత్రాన్ని నిర్మించాను. ఈ వయసులో కూడా నాకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాను. ప్రతి మహిళ ఇతర మహిళలు సాధించిన విజయాలను తెలుసుకునేందుకు కృషి చేయాలి. ఈ చిత్రం కూడా అలాంటి కోవకు చెందినదే. నిర్మాణాంతర పనులన్నీ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది' అన్నారు.

విరాట్ కోహ్లీగా శింబు? అనుష్కగా త్రిష?



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ పాత్రలో టాలీవుడ్ హీరో సిలంబరసన్ నటించనున్నారనే ప్రచారం కోలీవుడ్‌లో జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగానే శింబు తన హెయిర్ స్టైయిల్‌తో పాటు శరీరాకృతిని కూడా మార్చుకుంటున్నారు. ఇపుడు ఇదే అంశంపై ఆసక్తికర చర్చ కూడా సాగుతోంది. పైగా ఇటీవల శింబు నటించిన 'పత్తుతల' సినిమాలోని ఓ వీడియో చూసిన విరాట్ కోహ్లీ.. 'నీవు సింహానివి' అంటూ కామెంట్స్ చేశారు. అలాగే శింబు కూడా విరాట్ కోహ్లీని ఉద్దేశించి 'నీవూ సింహానివే' అంటూ ప్రతిస్పందించారు. దీంతో విరాట్ కోహ్లీ బయోగ్రఫీలో శింబు నటించనుండటం ఖాయమనే ప్రచారం సాగుతోంది. మరోవైపు విరాట్ సతీమణి అనుష్క పాత్రలో అగ్రహీరోయిన్ త్రిష నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. కాగా, విరాట్ కోహ్లీ ఐపీఎల్ మ్యాచ్‌లలో బిజీగా ఉండగా, శింబు మాత్రం 'థగ్‌లైఫ్', 'ఎస్‌టీఆర్49', 'ఎస్‌టీఆర్50', 'ఎస్‌టీఆర్51' ప్రాజెక్టుల్లో నటిస్తూ బిజీ బిజీగా ఉన్నారు.

ఇన్నవళ్ళి



తోపుడు బండితో జీవనయానం

తరుణి

- ముగ్గురు పిల్లల తల్లి ఒంటరి పోరాటం
- ఆత్మస్థైర్యానికి నిర్వచనం ఇన్నవళ్ళి

(టి.నగర్, ఆంధ్రజ్యోతి)

ఇటీవల చేపాక్ వాలాజా రోడ్డులో చిదంబరం స్టేడియంలో సీఎస్కే, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఆ మ్యాచ్ చూడటానికి ధోని అభిమానులంతా స్టేడియంలోకి వెళ్తున్నారు. అదే సమయంలో ఓ మహిళ తోపుడు బండిలో వంట పాత్రలను పెట్టుకుని సాయంత్రం ఐదు గంటలకు స్టేడియం తూర్పు గోడ వద్దకు వచ్చింది. ఆమెతోపాటు 25 యేళ్ల యువతి కూడా వచ్చింది.. చూస్తుండగానే ఇడ్లీలు, పూరీలతో పాటు చికెన్, చేపల కూర సిద్ధం చేశారు. కార్మికులు, కూలీలు, ఆటో డ్రైవర్లు ఆ టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చి ఆ దుకాణం నడుపుతున్న 50 యేళ్ల మహిళ 'ఇన్నవళ్ళి'ని ఆప్యాయంగా పలకరించారు. టిఫిన్ రెడీయాచ్చా? (టిఫిన్ రెడీ అయ్యిందా?) అనగానే 'రెడీ సార్' అంటూ రెగ్యులర్‌గా వచ్చే కస్టమరను గుర్తించి, వారికి నచ్చేవి ప్లేట్లలో పెట్టి అందించింది. ప్రతి ఐదు నిమిషాలకొకమారు ఆమె కస్టమర్లను ఆప్యాయంగా అడుగుతోంది. ఆ సమయంలో ఓ ముసలాయన టిఫిన్ తింటున్న కస్టమర్ల వద్ద చేయి చాచటం గమనించిన ఇన్నవళ్ళి 'ఓ పెద్దాయనా! కస్టమర్లను ఇబ్బంది పెట్టొద్దు. భిక్షం అడగవద్దు. కావాలంటే ఈ టిఫిన్ తినూ' అంటూ ప్లేటులో ఇడ్లీలు వేసి ఆ వృద్ధుడికి అందించింది. ఆ టిఫిన్ దుకాణం 'ఆల్ ఇన్ వన్' యజమానురాలు ఇన్నవళ్ళిని 'తరుణి' పలకరించింది.

ఆటలాడిన చోటే...

'నా పేరు ఇన్నవళ్ళి. పుట్టి పెరిగిందంతా ఈ చెన్నైలోనే..! ఈ ప్రాంతంలోనే...! ఆటపాటలతో నా బాల్యం కూడా గడించింది. మా ఇంటాయన సెక్యూరిటీగా పనిచేస్తుండేవారు. మాకు ముగ్గురమ్మాయిలు. ముగ్గురు ఆడపిల్లలతో ఎలా నెట్టుకు రాగలరంటూ మమ్మల్ని హేళనగా మాట్లాడేవారు. అయితే నేనెప్పుడూ కూతుళ్ల గురించి బాధపడనే లేదు. నా అనుభవం ద్వారా చెబుతున్నాను 'ఆడపిల్లలు ఎప్పటికీ తల్లిదండ్రులకు శాపం కాదు..! వరమే...! మా ఇంటాయనకు తాగుడు అలవాటు ఉండేది. చేతిలో కుటుంబ పోషణకు సరిపడా డబ్బులు ఉండేవి కావు. పిల్లలకు భోజనం పెట్టేందుకు వడ్డీకి అప్పులు చేసేదాన్ని. ఆ అప్పులు, వడ్డీలు రోజురోజుకూ అధికమయ్యాయి ఆ సమయంలోనూ నా కూతుళ్ల గురించి నేను దిగులుపడలేదు. మూడో అమ్మాయి 'కరుతమ్మ' పుట్టినప్పుడు ఇంటిలో చిల్లిగవ్వ లేదు. బాలింతగానే ఇళ్లలో పనులు చేస్తూ వచ్చాను.



జీవితానికి ఆసరాగా నిలిచిన బండి

ఆ తర్వాత ఓ టీషాపులో అంట్లు తోమే పనులు, పూల వ్యాపారం వంటివి చేశాను. రోజుకు 18 గంటలకు కష్టపడేదాన్ని. అంతచేసినా రెండు వందల రూపాయల సంపాదనే! పగలంతా సంపాదించిన డబ్బుతోనే సరుకులు కొని వండి పిల్లలకు పెట్టేదాన్ని.

బండి కొన్నాకే బాగుపడ్డా!

రోజువారీ సంపాదన కుటుంబ పోషణకు కూడా చాలటం లేదని, ఏదైనా వ్యాపారం చేయాలని అనుకున్నాను. అప్పట్లో ఈ ఏరియాలో భోజనం దుకాణాలేవీ లేవు. ఇక్కడ ఇడ్లీ దుకాణం పెట్టాలను అనుకున్నాను. చేతిలో ఉన్న రూ.200 పెట్టుబడితో వంటపాత్రలు, సరకులు, స్టవ్ కొన్నాను. ఓ తోపుడు బండి అద్దెకు తీసుకున్నాను. చిన్నప్పుడు ఆడుతూపాడుతూ తిరిగిన ఇక్కడే ఆ బండి నడిపాను. రోజూ వచ్చే సంపాదనలో బండి బాడుగ, మరుసటి రోజుకు అవసరమైన సరుకులు, పిల్లలకు కావాల్సిన వస్తువులు కొనేదాన్ని. ఆరుమాసాలు ఏ ఇబ్బంది లేకుండా గడిచింది.. మా ఏరియాలో టీ కొట్టు నడిపే వ్యక్తి దగ్గరున్న పాత తోపుడు బండిని కొనుక్కున్నాను. బడ్డీ కొట్టు కాస్తా తోపుడు బండి టిఫిన్ షాప్‌గా మారింది. అప్పటి నుండి మా కష్టాలు పారిపోయాయి. అన్ని ఖర్చులూ పోనూ వచ్చే లాభాలు తక్కువే అయినా వాటిని పొదుపు చేశాను.. ఆ సొమ్ముతోనే ఇద్దర పిల్లలకు పెళ్ళిళ్లు కూడా చేశాను. ఇటీవలే మా ఇంటాయన నా నుంచి దూరమయ్యాడు. ఆయన చనిపోయాక ఒంటరిపోరాటం చేస్తున్నాను. మూడో అమ్మాయికి కూడా పెళ్లి చేయడానికి డబ్బులు పొదుపు చేస్తున్నాను. నా 'కరుత్తమ్మ' పెళ్ళికూడా ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్లలాగే జరుగుతుందని అనుకుంటున్నాను.



టిఫిన్ చేస్తూ...

అంతకు మించిన సంతోషం ఏముంటుంది?

రోజూ పొద్దున 7 గంటలకే లేవటం. 10 గంటలకు భోంచేయటం. ఆ తర్వాత మార్కెట్‌కు వెళ్ళి సరుకులు తెచ్చి వండుతాను. సాయంత్రం 5 గంటలకు అన్ని వంటకాలు సిద్ధం. చిన్నమ్మాయి 'కరుతమ్మ'తో కలిసి వచ్చి ఇక్కడకు వచ్చి సాయంత్రం ఆరు గంటలకు వ్యాపారం ప్రారంభిస్తాం. రాత్రి 8 నుండి 11 గంటల వరకే మా వ్యాపారం. రాత్రి 12 గంటలకు అన్నీ సర్దుకుని ఇంటికి చేరటానికి వేకువజాము 2 గంటలవుతుంది. మూడు గంటలకు నిద్ర. మరుసటి రోజు ఏడు గంటలకల్లా లేవటం... మళ్ళీ అవే రిపీట్! రోజుకు సుమారు 1500 రూపాయల దాకా సంపాదిస్తున్నాను. ఆడపిల్లలు భారం కాదని, వరమనే నమ్మి, కష్టాల కడలిలో ఉన్న జీవితాన్ని ధైర్యమనే నావలో నడిపిస్తున్న ఇన్నవళ్లి తన అనుభవాలను తరుణితో ఇలా పంచుకుంది. దేవుడు మూడు పూటలా అన్నంపెడుతున్నాడు. ఆకలి బాధలు ఎలా ఉంటాయో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాం. అందుకనే డబ్బులు లేకుండా వచ్చే పేదలు, బిక్షగాళ్లకు టిఫిన్‌పెట్టి ఆకలిని తీరుస్తున్నాం. అందరూ ఆకలితో పస్తులు లేకుండా జీవించాలనే దేవుడిని రోజూ వేడుకుంటున్నాం!

వేసవి వేడుకలకు ముస్తాబైన నీలగిరి జిల్లా

- కుండీల్లో విరబూసిన పుష్పాలు



వేసవి సీజన్ సందర్భంగా ఊటీలో పూల సోయగం

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం సంతరించుకుని ప్రకృతి అందాలకు నిలయమై వేసవి విడిది కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన నీలగిరి జిల్లా ఈ ఏడాది వేసవి వేడుకలకు ముస్తాబయ్యింది. శని, ఆదివారాల్లో కోటగిరిలో నిర్వహించనున్న కూరగాయల ప్రదర్శనతో వేసవి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కున్నూరు సిమ్స్ పార్కులో పండ్ల ప్రదర్శన జరగనుంది. పర్వతశ్రేణులు అధికంగావున్న నీలగిరి జిల్లాలో ఉద్యానవన శాఖ నిర్వహణలో ఊటీ బొటానికల్ గార్డెన్, రోజ్ గార్డెన్, తేయాకు గార్డెన్, కున్నూరులో సిమ్స్ పార్కు, కాటేరి పార్కు, కోతగిరిలో నెహ్రూ పార్కులున్నాయి. ఏప్రిల్-మే నెలల్లో వేసవి సీజన్‌లో మాత్రమే స్వదేశీ, విదేశీ పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. వారిని ఆకట్టుకునేలా రాష్ట్రప్రభుత్వ పర్యాటక, ఉద్యాన వన శాఖలు ఈ సీజన్‌లో పుష్ప ప్రదర్శన, పండ్లు, కూరగాయల ప్రదర్శన కోసం ఆరు నెలల ముందే ఏర్పాట్లలో దిగుతాయి. బొటానికల్ గార్డెన్‌లో ప్రతిఏటా నిర్వహించే సెంటినరీ ఫ్లవర్స్ షోకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం వేసవి సీజన్ కోసం నీలగిరి జిల్లాలోని అన్ని పార్కులు ప్రత్యేక అంశాలతో ముస్తాబయ్యాయి. గూడలూరులో ఈ నెల 9,10,11 తేదీల్లో సుగంధ ద్రవ్యాల ప్రదర్శన, ఊటీలో 10,11,12 తేదీల్లో గులాబీల ప్రదర్శన జరుగనుంది. ప్రధానంగా 127వ పుష్పప్రదర్శన ఈ నెల 16న ప్రారంభమై 21వ తేదీ వరకు, ఆ తర్వాత 23,24,25 తేదీల్లో కున్నూరులో పండ్ల ప్రదర్శన జరగనుంది. కున్నూరులోని కాటేరి పార్కులో ఈ సంవత్సరం మొట్టమొదటి సారిగా ఈ నెల 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు కొండ జాతి పంటల ప్రదర్శన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత బొటానికల్ గార్డెన్‌లో పుష్ప ప్రదర్శన కోసం 200 ల రకాలకు పైగా సుమారు 5.5 లక్షల పూల మొక్కలు నాటి పెద్దగా పెంచుతున్నారు. ఇవే కాకుండా అలంకరణ నమూనాల కోసం సుమారు 35వేలకు పైగా కుండీలలో నాటిన వివిధ రకాల పుష్పాలు ప్రస్తుతం విరబూసి సువాసనలు వెదజల్లుతున్నాయి.

ప్రత్యేక బస్సులు...

నీలగిరి జిల్లాకు వెళ్ళే పర్యాటకుల సౌకర్యాం రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు ఆదివారం నుంచి ఊటీ తదితర ప్రాంతాలకు 65 ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి. కోవై నుంచి ప్రతిరోజు ఊటీకి నడుపుతున్న బస్సులతో పాటు ప్రస్తుతం అదనంగా 25 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అదేవిధంగా కున్నూర్, కోటగిరి, గూడలూరు ప్రాంతాలకు వేసవి సీజన్ ముగిసే వరకు 60 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా మహా సరస్వతి ఆలయ దశమ వార్షికోత్సవం

- మాండలిన్ రాజేష్‌కు అవార్డు ప్రదానం



మాండలిన్ రాజేష్, ఐటీ కమిషనర్ కోమలి కృష్ణలను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కం గ్రామంలోవున్న విద్యారంభ జ్ఞాన సరస్వతి ఆలయ దశమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. టి.నగర్ సర్ పిట్టి త్యాగరాయ హాలులో గురువారం రాత్రి ఆలయ ధర్మకర్త డాక్టర్ పీవీఆర్ కృష్ణారావు, మణిమాలారావు దంపతుల అధ్యక్షతన జరిగిన వేడుకలకు మాండలిన్ విద్వాంసులు రాజేష్ ముఖ్యఅతిథిగా, చెన్నై ఆదాయ పన్ను శాఖ కమిషనర్ కోమలి కృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవందించిన ఎం.శ్రీనివాసులు, కేవీ బాల సుబ్రహ్మణ్యం, శ్రీలక్ష్మీ మోహన్‌రావు, కె.రమణి, డాక్టర్ ఎస్.రమేష్‌బాబు, సీనియర్ న్యాయవాది ఎస్ఎల్ సుదర్శనం, ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ ఎంఎస్ చంద్రగుప్తా, వాసవీ క్లబ్‌ల జిల్లా గవర్నర్ సీఎం రాజేష్, జయరాజ్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ ట్రస్టీ జయశ్రీ రాజశేఖర్, శోభారాజా తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం మాండలిన్ రాజేష్‌కు 'గంధర్వవాద్య విశారద' పురస్కారం బహూకరించారు. డాక్టర్ జె.శ్రీనుబాబు సంగీతం సమకూర్చిన సరస్వతీ నమోస్తుతే ఆల్బమ్-2 ను ఆవిష్కరించారు. నాట్యకళాకారిణిలు, వయోలిన్ పోటీ విజేతలు, తెలుగు ప్రముఖులను నిర్వాహకులు సత్కరించారు. కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ టి.మోహనశ్రీ వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమం తేజారావు వందన సమర్పణతో ముగిసింది.

'పద్మశ్రీ' దాముకు 'అమృత' చైర్మన్ అభినందన



చెఫ్ దామును అభినందిస్తున్న ఆర్.భూమినాథన్

అడయార్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పాకశాస్త్ర నిపుణుడు దాము పద్మశ్రీ పురస్కారాన్ని ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న నేపథ్యంలో చెన్నై అమృత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఆర్.భూమినాథన్ ప్రత్యేకంగా కలిసి అభినందించారు. నగరంలోని ప్రముఖ నక్షత్ర హోటల్‌లో సౌత్ ఇండియన్ చెఫ్ అసోసియేషన్ (ఎస్ఐసీఏ) ఆధ్వర్యంలో చెఫ్ దాముకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో హోటల్ మేనేజ్‌మెంట్, ఏవియేషన్ అండ్ నర్సింగ్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న చెన్నై అమృత సంస్థ చైర్మన్ భూమినాథన్ పాలుపంచుకుని చెఫ్ దామును అభినందించారు. ఈ సందర్భంగా భూమినాథన్ మాట్లాడుతూ, 'పాకశాస్త్రంలో తన అసాధారణ విజయాల ద్వారా చెఫ్ దాము ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని, పద్మశ్రీ పురస్కారం రావడం ఆయన వ్యక్తిగత విజయాన్ని గుర్తించడమేకాకుండా, వంట రంగంలో రాణించడానికి ఇతరులను కూడా మార్గదర్శకంగా ఉంటుందన్నారు.

రామసేతు వంతెనపై వాకింగ్

- నౌకా సంస్థ టూర్ ప్యాకేజ్



రామసేతు వంతెన

పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రామసేతు వంతెనపై కి.మీ నడిచి వెళ్లి దర్శించుకొనేలా ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యటన అందించనున్నట్లు నాగపట్టణం నుంచి శ్రీలంకను నౌకలు నడుపుతున్న 'శుభం' సంస్థ డైరెక్టర్ సుందరరాజన్ తెలిపారు. ఈ మేరకు నాగపట్టణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నాగపట్టణం నుంచి కాంగేశన్ హార్బర్‌కు ఫిబ్రవరి 22వ తేది నుంచి మంగళవారం మినహా వారంలో ఆరు రోజులు ప్రయాణికుల నౌకా సేవలు ప్రారంభించామన్నారు. నౌకలో ప్రయాణికులు 22 కిలోల వరకు లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతించామని తెలిపారు. ప్రారంభంలో రూ.9,200లుగా నిర్ణయించిన ఛార్జీ, అనంతరం రూ.8,500లకు తగ్గించగా, ప్రస్తుతం మరో రూ.500 తగ్గించి రూ.8వేలు వసూలుచేస్తున్నామన్నారు. అలాగే, పర్యాటకులను ఆకట్టుకొనేలా సరికొత్త పర్యాటక రాయితీ అందిస్తున్నామని తెలిపారు. ఆ ప్రకారం, రూ.15,000 ప్యాకేజీలో రెండువైపులా ఛార్జీలు, వాహనం, మూడు రాత్రుల బస వసతితో అందిస్తున్నామన్నారు. మరో ప్యాకేజీలో... శ్రీలంకలో ఐదు రాత్రులు, ఆరు రోజు లు బస, ఆహారం, వాహనం తదితరాలకు ఒక వ్యక్తికి రూ.30,000 ఛార్జీ నిర్ణయించామన్నారు. ఈ ప్యాకేజీలో ముఖ్యాంశంగా రామసేత వంతెనపై గంటసేపు నడక, రామాయణంతో సంబంధాలున్న సీతావనం, అశోక వనం, రావణుడి గుహలు, ప్రసిద్ధిచెందిన ప్రాచీన ఆలయాలు, పురాణ ప్రాంతాలు తదితరాలను వీక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇక, పాఠశాల విద్యార్థులకు టిక్కెట్టు ధరలో 10 శాతం రాయితీ, వారితో వెళ్లే ఒక ఉపాధ్యాయుడికి ఉచిత టిక్కెట్ ఇవ్వనున్నామన్నారు. జూన్ మొదటి వారం నుంచి మూడు గంటల్లో శ్రీలంకకు చేరుకొనేలా 250 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన మరో నౌకను ప్రారంభించనున్నామని, జూన్ మొదటి వారం నుంచి సరుకుల నౌక ప్రారంభించనున్నామన్నారు. అలాగే, రామేశ్వరం నుంచి శ్రీలంకకు, నాగపట్టణం నుంచి వేలాంకన్నికి పర్యాటకుల నౌకలు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

అలరించిన శాంతను భట్టాచార్య సంగీత విభావరి



పండిట్ శాంతను భట్టాచార్య బృందంతో విశ్వకళా సంగమ నిర్వాహకులు

ప్యారీస్, మే 2 (ఆంధ్రజ్యోతి): హిందూస్థానీ సంగీత రంగంలో ప్రత్యేకమైన కీర్తనల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్న పండిట్ శాంతను భట్టాచార్య హిందూస్థానీ సంగీత కచేరీ ఆద్యంతం అలరించింది. శాస్త్రీయ కళలను పోషిస్తున్న విశ్వకళా సంగమ ఆధ్వర్యంలో టి.నగర్ ఆస్కా ప్రాంగణంలో గురువారం సాయంత్రం హిందూస్థానీ సంగీత విభావరి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పండిట్ శాంతను భట్టాచార్య తనదైన శైలిలో ఖయాల్, తుమ్రీ, దాద్రా, భజనల్లోని ప్రత్యేకమైన కీర్తనలు ఆలపించి శ్రోతలను పరవశింపజేశారు.. ఆయనకు శ్రీరామ్ తబలాపై వాయిద్య సహకారమందించారు. ఈ సభకు విశ్వకళా సంగమ, ఊరా గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు ఊరా లక్ష్మీనరసింహారావు, సితార విద్వాంసులు జనార్ధన్ మిట్టా సారథ్యం వహించి హిందూస్థానీ సంగీతంలోని విశిష్టతను వివరించారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు.

అద్దాల వంతెన తిలకించేందుకు పర్యాటకుల ఆసక్తి




పెరంబూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): అద్దాల వంతెనపై వెళ్తూ కింద ఉన్న సముద్రపు అందాలు చూస్తూ పర్యాటకులు ఆనందభరితుల వుతున్నారు. కన్నియాకుమారి సముద్రం మధ్యలో, ఒక రాతిపై తిరువళ్లువర్ విగ్రహం, మరొక రాతిపై స్వామి వివేకానంద స్మారక చిహ్నం ఉన్నాయి. తిరువళ్లువర్ విగ్రహం నుంచి వివేకానంద స్మారక చిహ్నం వద్దకు వెళ్లేందుకు సముద్రం మధ్యలో అద్దాల వంతెన నిర్మించారు. ఈ వంతెనపై నడిచి వెళుతూ దిగువన ఉన్న సముద్రపు అందాలు, మత్స్యసంపదను వీక్షించవచ్చు. గత నెల 21వ తేది నుంచి గురువారం వరకు సుమారు లక్ష మంది వంతెనపై వెళ్లినట్లు పుంపుహార్ నౌకయాన సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

అద్దాల వంతెన మీదుగా వెళ్తున్న పర్యాటకులు

ఇంధన భద్రతపై కీలక సమావేశం

అడయార్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంధన భద్రత పెంపొందించడంపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్‌తో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఎన్‌ఎల్‌సీ సంస్థ సీఎండీ ప్రసన్న కుమార్ మోటుపల్లి, బొగ్గు మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి సంజీవ్ కుమార్, కస్సీ కోల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ (మార్కెటింగ్) ముఖేష్ చౌదరి, తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అల్బీ జాన్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో రాష్ట్రం అంచనా వేసిన విద్యుత్ డిమాండ్, ఎన్‌ఎల్‌సీ, బొగ్గు లభ్యత, వేసవి, వర్షాకాలంలో గరిష్ఠ లోడ్ సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు.



విక్రమ్ దేవ్ దత్ - మురుగానందం

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి

రాజుపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి చెందిన సంఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై గుంటూరు జిల్లా రాజుపాలెం మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం కల్లకుర్చి జిల్లా చిన్నపేలం మండలం ముంగ్లిల్‌పాడి గ్రామానికి చెందిన ముత్తు పాండి(25), చందిరన్ వత్రివేలు, రాయప్పన్ మణిమారన్ ముగ్గురు కలిసి మండలంలోని కొండమోడుకు చెందిన అంకాళ్ల డేవిడ్ దగ్గరకు వరికోత మిషన్ తీసుకువచ్చారు. శుక్రవారం వరికోత మిషన్‌ను బెల్లంకొండ నుండి కొండమోడు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో వత్రివేలు, మణిమారన్ మిషన్‌లో ఉండగా పాండి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యలోని చౌటపాపాయపాలెం గ్రామ సమీపంలోకి వచ్చేసరికే వెనుక వస్తున్న లారీ పాండిను ఆ తరువాత వరికోత మిషన్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పాండి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అజ్ఞాతంలోకి 'ఎర్ర' దొంగలు

- పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరి పూచీకత్తుతో ఐదుగురు నిందితులు జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పూచీకత్తుదారులకు భారీ జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ అధికారి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా పెరియవళ్లి గ్రామానికి చెందిన ఎ.రమేష్, కుమార్, డి.చిన్నస్వామి, సుధాకర్, ఏలుమలై.. చిత్తూరు జిల్లా ఐరాల పరిధిలో ఎర్రచందనం దుంగలు అపహరించారు. దీనికి సంబంధించి ఐదేళ్ల క్రితం ఐరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల తర్వాత వీరికి పీలేరుకు చెందిన జి.శేషాద్రి నాయుడు, ప్రసాద్ ష్యూరిటీ ఇచ్చి బెయిల్‌పై విడుదల చేయించారు. బెయిల్‌పై విడుదలైన ఐదుగురిలో ఎ.సుధాకర్ మృతి చెందాడు. మరో నలుగురికి న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేయించిన ఇద్దరికి.. ఒక్కో నిందితుడికి రూ.20 వేల చొప్పున జరిమానా చెల్లించాలంటూ శుక్రవారం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు.

'ఎర్ర' స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణి(35)పై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం ఆమోదించింది. తిరువణ్ణామలై జిల్లా జమునమత్తూరు తాలూకా నల్లపట్టు గ్రామానికి చెందిన గోవిందన్ కుమారుడు శివమణి తరచూ ఎర్రావారిపాలెం మండల పరిసరాల్లోని అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికి దుంగలు అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసు, టాస్క్‌ఫోర్స్ రికార్డులు చెబుతున్నాయి. ఇతడిపై పలు కేసులు నమోదు కావడంతో పాటు ప్రస్తుతం అరెస్టయి కడప సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్నాడు. ఎర్రచందనం అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరిస్తుండడం, పలు కేసులతో నేర చరిత్ర కలిగివున్న నేపథ్యంలో అతడిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ కలెక్టర్ మార్చి 22న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై గత నెల 16వ తేదీన అడ్వైజరీ బోర్డు నిందితుడిని, దర్యాప్తు అధికారులను విచారించింది. నిందితుడి నేర చరిత్రను పరిగణనలోకి తీసుకున్న అడ్వైజరీ బోర్డు కలెక్టర్ విధించిన పీడీ యాక్టును సమర్థిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో తిరుపతి కలెక్టర్ నిర్ణయాన్ని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది

కాళంగి నదిలో స్నానానికి వెళ్లి సేలం వాసి మృతి

సూళ్లూరుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలోని కాళంగి నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు.... తమిళనాడు సేలం ప్రాంతానికి చెందిన చిన్నుస్వామి(50) తన భార్య హంసవేణితో కలిసి కొన్నాళ్లుగా సూళ్లూరుపేటలోనే చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కాళంగి నదిలో స్నానాకి దిగి నీట మునిగిపోయాడు. సమీపంలో ఉన్న గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- స్కూటర్‌పై 98వేల కిలోమీటర్ల సంకల్పయాత్ర

అమ్మ కోసం



శ్రీవారిని దర్శించుకున్న ఆనందంలో అమ్మా కొడుకులు

పాత బజాజ్ చేతక్ స్కూటర్ నడుపుతూ కొడుకు.. వెనుక సీటుపై అమ్మ.. ఒకటీ రెండూ కాదు, ఇలా 98వేల కిలోమీటర్లు తిరిగి తిరుమలకు వచ్చారు ఈ తల్లీకుమారులు. ఉల్లాసంగా ఉత్సాహంగా దూసుకుపోతున్న వీరిని పలకరించినపుడు ఆసక్తికరమైన అనేక సంగతులు పంచుకున్నారు. స్కూటర్ నడుపుతున్న దక్షిణామూర్తి కృష్ణకుమార్‌ది మైసూరు. బెంగళూరులోని ఒక కార్పొరేట్ సంస్థలో టీం లీడర్‌గా ఉద్యోగం. 2015లో తండ్రి చనిపోవడంతో అమ్మను బెంగళూరుకు తీసుకువచ్చాడు. జీవన సహచరుడ్ని కోల్పోయిన దుఃఖంలోంచి అమ్మను బయటకు తీసుకురావడానికి రోజూ ఆఫీసు నుంచి వచ్చాక ఆలయాల గురించి చెప్పేవాడు. ఆమె ఎంతో ఆసక్తిగా వినేది. ఒకరోజు ఎందుకో.. 'అమ్మా.. నువ్వు ఇప్పటిదాకా ఏయే ఆలయాలు సందర్శించావు?' అని అడిగాడు. నోటితో కాకుండా తొణికిసలాడే కన్నీటితో అమ్మ సమాధానం చెప్పింది. తన సమీపంలో ఉండే ఒక్క ఆలయానికి కూడా ఆమె ఇప్పటిదాకా వెళ్లనేలేదు అని తెలుసుకుని తల్లడిల్లిపోయాడు. 68 ఏళ్ల వయసు వచ్చినా ఇల్లు తప్ప ఆమెకు మరో ప్రపంచం తెలీదు. 'నీకు దేశంలో ఉన్న అన్ని ఆలయాలూ చూపిస్తానమ్మా!' అని కృష్ణకుమార్ తల్లికి మాటిచ్చాడు. ఉద్యోగం చేస్తూ అమ్మకి ఆలయాలన్నీ చూపించడం సాధ్యం కాదని అతనికి అర్థమైంది. 2018లోనే రూ.60 వేలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేశాడు. 2018 జనవరి 16న తన బజాజ్ స్కూటర్ మీదే 'మాతృ సేవా సంకల్ప యాత్ర' ప్రారంభించాడు. కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్, బిహార్, పశ్చిమబెంగాల్, సిక్కిం, అస్సాం, మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్.. ఇలా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలన్నీ తల్లితో స్కూటర్‌పై తిరుగుతున్నాడు ఈ 45 ఏళ్ల కుమారుడు. నేపాల్, భూటాన్‌కూ తల్లితో స్కూటర్‌పైనే వెళ్లాడు. ఇప్పటికి 98,109 కిలోమీటర్లు ప్రయాణించాడు. గురువారం తిరుమలకు చేరుకుని తల్లి చూడరత్నమ్మతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నాడు. తన సంకల్పయాత్రకు అవరోధం కాకూడదని కృష్ణకుమార్ పెళ్లి కూడా చేసుకోలేదు. ఎందుకీ త్యాగం? అని అడిగితే, 'చనిపోయాక శ్రాద్ధకర్మలు ఘనంగా చేయడం కాదు.. బతికి ఉన్నపుడు సంతోషపెట్టడమే కొడుకుగా నా బాధ్యత' అని సమాధానం ఇచ్చాడు. ఈ సంకల్ప యాత్రలో ప్రయాణిస్తున్నది ఇద్దరు కాదు, ముగ్గురు. అంటూ తన స్కూటర్ వైపు మురిపెంగా చూశాడు. 'నాకు 21 ఏళ్ల వయసులో నాన్న ఇచ్చిన కానుక ఇది. దీని మీద తిరుగుతూ ఉంటే నాన్న కూడా మాతోపాటే యాత్రలు చేస్తున్నట్టుగా ఉంది. ఈ యాత్రకు ముగింపు లేదు. అమ్మా నేనూ ఓపిక ఉన్నంతదాకా ఇలా తిరుగుతూనే ఉంటాం. ఒక్కో గుడినీ సందర్శిస్తూ ఉంటే అమ్మ గొప్ప ఆనందం పొందుతోంది. నాకు జన్మనిచ్చిన తల్లికి ఇంతకన్నా ఏవిధంగా రుణం తీర్చుకోగలను?' అని అమ్మను అల్లుకుపోయి ఆనందంగా చెప్పాడు కృష్ణకుమార్.



బైక్‌పై కుమారుడు కృష్ణకుమార్, తల్లి చూడరత్నమ్మ



అద్భుతంగా అమరావతి





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం





కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు



సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక • రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి





మహిళల విజయ దరహాసం





దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

